సాక్షి
కామారెడ్డి

బుధవారం । 1 । అక్టోబర్ । 2025



ముంచిన 'మంజీర'

భారీ వర్షాలతో మంజీర నదికి వరద పోటె త్తడంతో పరీవాహక ప్రాంతంలోని ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి.

- 10లో ▸



ఘనంగా బతుకమ్మ

జిల్లాలోని పలు ప్రాంతాలలో మంగళవారం సద్దుల బతుకమ్మ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.7 /20.9

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



కామారెడ్డి క్రైం: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కొత్త బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. బైక్‌పై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. అధిక వేగం మంచిది కాదన్నారు. సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ పర్యవేక్షణ జరుగుతోందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్, సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, రాష్ డ్రైవింగ్ లాంటివి చేస్తే చలానాలు జారీ చేస్తామన్నారు. ఆయన వెంట ఏఎస్పీ చైతన్యరెడ్డి, ట్రాఫిక్ ఎస్సై మహేష్, టౌన్ ఎస్సై నరేశ్ తదితరులు ఉన్నారు.

యూనిఫామ్‌ల పంపిణీ



కామారెడ్డి క్రైం : దసరా పండుగను పురస్కరించుకుని జిల్లాలోని సివిల్ సప్లై హమాలీలకు మంగళవారం యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకాంత్ వారికి యూనిఫామ్‌లతో పాటు స్వీట్లు అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు దశరథ్, జిల్లా కార్యదర్శి బాలరాజ్, సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా కార్యదర్శి బాజీ, జిల్లా కోశాధికారి మహీపాల్, ఆయా సంఘాల ప్రతినిధులు శ్రీనివాస్, కృష్ణ, సాయిలు, రవి, రమేష్, నర్సింలు, బాబు, హనుమాండ్లు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: అక్టోబర్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ బుధవారం ప్రారంభం కానుంది. ఆహారభద్రత కార్డులపై ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులపై 10 కిలోల చొప్పున అందిస్తారు. ఈనెల ఒకటో తేదీనుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. కాగా ఆరునెలలుగా రావాల్సిన కమీషన్ కోసం రేషన్ డీలర్లు ఆందోళనకు సిద్ధమైన విషయం తెలిసిందే. అయితే త్వరలోనే కమీషన్ వచ్చేలా చూస్తామని సివిల్ సప్లై కమిషనర్ హామీ ఇవ్వడంతో దుకాణాల బంద్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, యథావిధిగా బియ్యం పంపిణీ చేయనున్నట్లు డీలర్ల సంఘం ప్రతినిధులు ప్రకటించారు.

జెడ్పీ పీఠంపై కన్ను!

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆశావహులు పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధానంగా జెడ్పీ పీఠంపై చర్చ సాగుతోంది. అధికార పార్టీనుంచి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి జెడ్పీటీసీగా బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. మరోవైపు బీఆర్ఎస్ నాయకురాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ కూడా మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నట్లు తెలుస్తోంది.



- కాంగ్రెస్‌లో తెరపైకి 'ఏనుగు' పేరు
- జెడ్పీటీసీగా పోటీ చేయాలని ఒత్తిడి తెస్తున్న అనుచరులు
- మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్న దఫేదార్ శోభ
- బీఆర్ఎస్‌కు మెజారిటీ వస్తే చైర్‌పర్సన్ అయ్యే అవకాశం!



ఏనుగు మంజుల, రవీందర్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలవడంతో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. ప్రధానంగా పలువురు నేతల దృష్టి జెడ్పీ పీఠంపై ఉంది. జెడ్పీటీసీగా గెలిచి జిల్లాపరిషత్ చైర్మన్ కావాలని పలువురు ఆశించారు. జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం మీద కన్నేసిన పలువురు నేతలు.. వీలైతే తాము లేకపోతే కుటుంబ సభ్యులను బరిలో నిలపాలని భావించారు. అయితే జెడ్పీ చైర్మన్ రిజర్వేషన్ అనుకూలంగా వచ్చినా.. తమ మండల జెడ్పీటీసీ స్థానం రిజర్వేషన్ కలిసి రాకపోవడంతో చాలామంది నిరాశకు గురయ్యారు. పలువురు నేతలు ఇక రాజకీయాలు వద్దనే పరిస్థితికి చేరుకున్నారు.

కోర్టు తీర్పు వచ్చాకే..

బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు ఈనెల 8 తీర్పు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. అప్పటివరకు వేచిచూసే ధోరణిలో ఆశావహులు ఉన్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చినా.. ఇప్పుడే తొందరపడి జేబులు ఖాళీ చేసుకోవడం ఎందుకన్న ఆలోచనలో పలువురు ఉన్నారు. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు వచ్చాక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

దఫేదార్ శోభ

బీఆర్ఎస్ నుంచి మళ్లీ దఫేదార్‌కే!?


బీఆర్ఎస్‌కు చెందిన దఫేదార్ రాజు నిజామాబాద్ జెడ్పీ చైర్మన్‌గా 2014 నుంచి 2019 వరకు పనిచేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత 2019లో పరిషత్ ఎన్నికలు జరిగాయి. కామారెడ్డి నూతన జిల్లా పరిషత్‌గా ఏర్పటైంది. 2019లో జరిగిన ఎన్నికలలో బీసీ మహిళకు అవకాశం రావడంతో దఫేదార్ రాజు భార్య శోభ బరిలో నిలిచారు. ఆ ఎన్నికలలో బీఆర్ఎస్‌కే ఆధిక్యం దక్కడంతో ఆమెకు చైర్‌పర్సన్ అవకాశం లభించింది. దఫేదార్ రాజు సొంత మండలం మహ్మద్‌నగర్ మళ్లీ బీసీ మహిళకు రిజర్వ్ అయ్యింది. దీంతో మరోసారి శోభ బరిలో నిలిచే అవకాశాలున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ వస్తే శోభకు చైర్‌పర్సన్ అవకాశాలుంటాయని ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది.

కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం..

స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ అనుకూలంగా వచ్చిన నేతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వారు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు అధికార పార్టీకి ప్రతిష్టాత్మకం. ఈ ఎన్నికలలో గెలిచి పట్టు నిలుపుకునేందుకు కాంగ్రెస్ గట్టిగా ప్రయత్నించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవిపై ఆ పార్టీలో చర్చ నడుస్తోంది. చైర్మన్ పదవి జనరల్ కావడంతో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. గతంలో ఎల్లారెడ్డి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. గత అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. బాన్సువాడ నియోజకవర్గ కేంద్రంగానే ఆయన రాజకీయాలు నడిపిస్తున్నారు. అయితే బాన్సువాడలో సిట్టింగ్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అక్కడ కాంగ్రెస్ రెండుగా చీలిపోయింది. ఈ నేపథ్యంలో ఏనుగు రవీందర్‌రెడ్డి జెడ్పీ చైర్మన్ స్థానంకోసం ప్రయత్నించాలని ఆయన అనుచర వర్గం కోరుతోంది. ఆయన సొంత మండలం తాడ్వాయి జెడ్పీటీసీ స్థానం జనరల్ కావడం ఆయనకు అనుకూలించే అంశం. అనుచరులు ఫోన్లు చేసి ఒత్తిడి తెస్తుండడంతో రవీందర్‌రెడ్డి ఆలోచనలో పడ్డట్లు తెలుస్తోంది. రవీందర్‌రెడ్డి లేదంటే ఆయన భార్య మంజులారెడ్డి బరిలో దిగుతారన్న ప్రచారం జోరందుకుంది.

బడుగుల చేతికి పల్లె పాలన!

- 201 పంచాయతీల్లో బీసీలకు రిజర్వేషన్ అనుకూలం
- 91 సర్పంచ్ స్థానాలు గిరిజనులకు..
- 79 సర్పంచ్ పదవులు ఎస్సీలకు రిజర్వ్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పల్లె పాలనలో బడుగులదే పైచేయిగా నిలువనుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ద్వారా సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా ఎంతోమందికి అవకాశాలు దక్కనున్నాయి. జిల్లాలో 532 పంచాయతీలు ఉండగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కలిపి కనీసం 371 గ్రామాల్లో సర్పంచ్‌లుగా అవకాశం దక్కనుంది. ఇందులో 65 గిరిజన పంచాయతీల్లో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల స్థానాలన్నీ గిరిజనులకే దక్కుతాయి. అలాగే ఎస్టీ రిజర్వేషన్ల ద్వారా మరో 26 పంచాయతీల్లోనూ గిరిజనులే సర్పంచ్‌లు కానున్నారు. ఇందులో కనీసం 40 మంది గిరిజన మహిళలకు అవకాశం దక్కనుంది. బీసీలకు 201 సర్పంచ్ పదవులు రిజర్వ్ అయ్యాయి. ఇందులో 96 స్థానాలను మహిళలకు కేటాయించారు. ఎస్సీ సామాజిక వర్గానికి 79 పంచాయతీలు దక్కాయి. ఇందులో 35 చోట్ల మహిళలకు అవకాశం ఇచ్చారు.

17 జెడ్పీటీసీ, ఎంపీపీలు..

జిల్లాలో 25 మండలాలు ఉండగా, జెడ్పీటీసీ సభ్యులతో పాటు ఎంపీపీ పదవులు 17 బడుగులకు దక్కనున్నాయి. ఇందులో బీసీలకు 11 స్థానాలు కేటాయించగా, ఐదుచోట్ల బీసీ మహిళలు మాత్రమే పోటీ చేయనున్నారు. ఎస్సీలకు నాలుగు స్థానాలు ఇవ్వగా.. రెండుచోట్ల ఎస్సీ మహిళలకు అవకాశం దక్కింది. ఎస్టీలకు రెండు స్థానాలు కేటాయించగా.. ఒక స్థానంలో ఎస్టీ మహిళ పోటీ చేయనున్నారు. అలాగే ఎంపీటీసీ స్థానాలు 233 ఉండగా.. ఇందులో బీసీలకు 98, ఎస్సీలకు 40, ఎస్టీలకు 20 స్థానాలు రిజర్వ్ అయ్యాయి.

రుణమాఫీ పథకం వందశాతం అమలు చేయాలి



రామేశ్వర్‌పల్లి విండో మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ భూంరెడ్డి


భిక్కనూరు: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల పంట రుణాల మాఫీ పథకాన్ని వంద శాతం అమలు చేయాలని రామేశ్వర్‌పల్లి రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం రామేశ్వర్‌పల్లిలో విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డి అధ్యక్షతన 68వ విండో మహాజన సభ నిర్వహించారు. ఈ సభలో రైతులు పలు తీర్మానాలను ఆమోదించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని, రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు కేంద్రాల్లో హమాలీ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని తీర్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ మద్ది సూర్యకాంత్‌రెడ్డి, ప్రతినిధులు పోతిరెడ్డి, నర్సారెడ్డి, విండో సీఈవో శంకర్, వైస్‌చైర్మన్ శేఖర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి

కామారెడ్డి అర్బన్: వ్యవసాయ మోటార్‌పంపులకు కెపాసిటర్లు బిగించడం ద్వారా వాటి జీవితకాలాన్ని పెంచుకోవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల వద్ద ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇస్తే సిబ్బంది వచ్చి పరిష్కరిస్తారని పేర్కొన్నారు. సిబ్బందికి ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. పొలం బాట ద్వారా జిల్లాలో 1,465 వదులుగా ఉన్న లైన్లను సరిచేశామని, 1,494 వంగిన స్తంభాల మధ్య సరిచేయడంతో పాటు కొత్తగా 1,781 స్తంభాలను మధ్యలో వేశామని ఎస్ఈ పేర్కొన్నారు.

నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. మంగళవారం 1,00,963 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 15 వరద గేట్లను ఎత్తి 70,648 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1,400.50 అడుగుల (11.891 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.



నిజాంసాగర్ వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు

నవరాత్రి శోభ

జిల్లా కేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం పలు మండపాల వద్ద భక్తులు దాండియా ఆడారు. జేపీఎన్ రోడ్‌లో శాస్త్రి ఆదర్శ సంఘం, హిందూసేన, విద్యానగర్ కాలనీ గణసేన తదితర మండపాల వద్ద భక్తుల సందడి కనిపించింది.

– కామారెడ్డి టౌన్

జిల్లా కేంద్రంలోని హిందూసేన మండపం వద్ద భక్తుల సందడి





జిల్లా కేంద్రంలోని జేపీఎన్ రోడ్ శాస్త్రి ఆదర్శ సంఘం మండపం వద్ద..

ఎన్నికల నియమావళిని పాటించాలి

- కోడ్ ఉల్లంఘించేవారిపై చర్యలు తప్పవు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు రెండు విడతల్లో జరుగుతాయన్నారు. తొలి విడతలో కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలోని 13 మండలాల(గాంధారి మినహా) పరిధిలోని 266 పంచాయతీలకు, రెండో విడతలో బాన్సువాడ డివిజన్‌లోని 11 మండలాలతో పాటు గాంధారి మండలానికి కలిపి 266 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఆఫీసర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ఎన్నికల నియమావళిని అమలు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై అభ్యర్థులు ఎలాంటి రాతలు రాయొద్దన్నారు. జెడ్పీటీసీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు రూ.4 లక్షల వరకు, ఎంపీటీసీలు రూ లక్షన్నర రూపాయల వరకు, ఐదు వేలకుపైగా జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్‌లుగా పోటీ చేసేవారు రూ. 2.50 లక్షలు, ఐదు వేలలోపు జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు లక్షన్నర రూపాయల వరకు ఖర్చు చేసుకోవచ్చన్నారు. ఐదు వేల జనాభా పైన ఉన్న గ్రామాల్లో వార్డు సభ్యులు రూ.50 వేలు, ఐదు వేల లోపు జనాభా ఉన్న గ్రామాల్లో వార్డు సభ్యులు రూ.30 వేలు ఖర్చు చేసుకోవచ్చన్నారు.

నిరంతరం వాహనాల తనిఖీలుంటాయి

ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఇంటిగ్రెటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే 613 పోలింగ్ లొకేషన్లు, అలాగే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరిగే 605 పోలింగ్ లొకేషన్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో నలుగురి వద్ద ఆయుధాలు ఉన్నాయని, ఎన్నికల నేపథ్యంలో వాటిని డిపాజిట్ చేసుకుంటామని పేర్కొన్నారు. 197 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, డీపీవో మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన ఎస్పీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్లు

రాజకీయ పార్టీలు సహకరించాలి

కామారెడ్డి క్రైం: స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల ప్రచారం, ప్రచార ఖర్చులు, ఓటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి తదితర అంశాలను పార్టీల ప్రతినిధులకు వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్‌నాయక్, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, డీపీవో మురళి, రాజకీయ పార్టీల ప్రతినిధులు కైలాస్ శ్రీనివాస్‌రావు, కుంబాల రవియాదవ్, చంద్రశేఖర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

క్లుప్తంగా

శోభాయాత్ర శాంతియుతంగా జరుపుకోవాలి



రుద్రూర్: దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలని కోటగిరి ఎస్సై సునీల్ సూచించారు. కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం దుర్గాదేవి శరన్నవ రాత్రి ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, డీజేలు పెట్టవద్దని సూచించారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో మంగళవారం రాత్రి నిషేధిత మాదక ద్రవ్యాలపై ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగులు, హోటల్స్‌లలో, పాన్ షాపులతోపాటు పలు దుకాణాల్లో నిషేధిత మత్తు పదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్‌ల ద్వారా పరిశీలించారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

మోపాల్: మోపాల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ గంగాప్రసాద్‌ను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సస్పెండ్ చేసినట్లు సీఐ సురేశ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి గోప్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని చేరవేయడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. విలువైన సమాచారాన్ని ఇతరులకు చేరవేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సురేశ్‌కుమార్ హెచ్చరించారు.

బాండ్ పేపర్లను నమ్మే పరిస్థితి లేదు

- కేసీఆర్ పాలనలో యూరియా కొరత రాలేదు
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్ : బాండ్ పేపర్ల సంగతి జిల్లా ప్రజలందరికీ తెలుసని, ప్రస్తుతం బాండ్ పేపర్లను నమ్మే పరిస్థితి లేదంటూ ఎంపీ అర్వింద్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం భీమ్‌గల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీ ఉండదని అర్వింద్ బాండ్ పేపర్ రాసిస్తా అంటున్నాడని తెలిపారు. బాండ్ పేపర్ పేరుతో ఎంపీ ఒకసారి చేసిన మోసాన్ని ప్రజలు మర్చిపోలేరని, అందుకే బాండ్ పేపర్లను నమ్మే పరిస్థితి లేదన్నారు. అర్వింద్ తన స్థాయిని తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ అంటే ఏంటో ఒకసారి బడా భీమ్‌గల్‌కు వచ్చి చూడాలని సవాల్ విసిరారు. పసుపు రైతులను మోసం చేస్తున్న చరిత్ర ఎంపీదని, పసుపు బోర్డుకు ఒక నేమ్ బోర్డు ఉంది తప్ప పంటకు మద్దతు ధర ఇంకా తేలేదని ఆరోపించారు. బోర్డు రాక ముందు రూ.10వేలు పలికిన ధర ప్రస్తుతం రూ.6వేలకు పడిపోయిందని విమర్శించారు. దేశం కోసం అని నమ్మి.. మోదీని చూసి రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే.. రైతులకు కనీసం యూరియా బస్తాలు ఇప్పించరా? అని ప్రశ్నించారు. 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో ఏనాడూ యూరియా కొరత రాలేదని తెలిపారు. ఓటేసి గెలిపిస్తే ఎవరు ఏం చేస్తున్నారో ప్రజలు అన్ని గమనిస్తున్నారని, మోదీతో రాష్ట్రానికి, అర్వింద్‌తో జిల్లాకు ఒరిగిందేమీ లేదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారని అన్నారు.



పెద్దమల్లారెడ్డిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వరి ఆలయంలో..



జనగామలో..

నవదుర్గా నమోస్తుతే!

శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం వివిధ మండపాల్లో అమ్మవారు దుర్గాదేవి, సిద్ధిదాత్రి తదితర అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భారీ సంఖ్యలో భక్తులు మండపాలకు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పలుచోట్ల యజ్ఞాలు, యాగాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో మండపాల నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

– సాక్షినెట్‌వర్క్



నర్వ గ్రామంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



కామారెడ్డి పట్టణంలో..



గోపాల్‌పేటలో..



ధర్మారావ్‌పేట్‌లో..



భిక్కనూరులో దుర్గామాత మండపం వద్ద అన్నదానం ..




కృష్ణాజీవాడిలో..



గోపాల్‌పేటలో దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్



కామారెడ్డిలో పసుపు, కుంకుమ ప్యాకెట్లతో అలంకరణ..



బాన్సువాడలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న సరస్వతి దేవి..



పూజలు నిర్వహిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి



దేవునిపల్లిలో బోనాలను ఊరేగిస్తున్న భక్తులు



బస్వన్నపల్లిలో..



శెట్పల్లిసంగారెడ్డిలో..



దొంగ్లీలో పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు



కామారెడ్డిలో దుర్గామాత వేషధారణలో చిన్నారి

దేశ ప్రయోజనాలే సంఘ్ సభ్యులకు ముఖ్యం



బీబీపేటలో మాట్లాడుతున్న గోవర్ధన్ రెడ్డి

బీబీపేట: ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులకు వ్యక్తి, కుటుంబం, సంస్థ, కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ్ సహకార్యవాహ పాపయ్యగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. దేశ సేవలో సంఘ్ పాత్ర ఎంతో గొప్పదన్నారు. దేశంలో ప్రపంచంలో ఎన్నో సంస్థలు, సంఘాలు ఏర్పడ్డాయని కానీ కాలగమనంలో గతించాయన్నారు. కానీ సంఘ్ మాత్రం దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలకు కోసం మాత్రమే పని చేసిందని, భవిష్యత్తులో కూడా చేస్తుందని తెలిపారు. సంస్థప్రతినిధులు ఏదుల్ల ఇంద్రసేనారెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మేనూర్‌లో మాట్లాడుతున్న శివకుమార్

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

మద్నూర్(జుక్కల్): మండలంలోని మేనూర్‌లో మంగళవారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను స్వయం సేవకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనూర్‌లోని ప్రధాన వీధులలో స్వయం సేవకులు పద సంచలన్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా విభాగ్ ప్రచారక్ శివకుమార్ మాట్లాడారు. దేశంలో ఎక్కడ ఆపద వచ్చినా స్వయం సేవకులు ముందుండి సహాయక చర్యల్లో పాల్గొంటారన్నారు. ప్రాణాలకు తెగించి విపత్కర పరిస్థితులను సైతం లెక్క చేయకుండా స్వయం సేవకులు చేసిన సామాజిక కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయన్నారు. దేశం కోసం ధర్మం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో స్వయం సేవకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలో విద్యుత్ స్తంభం!



ఎక్కడైన విద్యుత్ స్తంభాలు రోడ్డు పక్కన, ఇంటి ముందరలో ఉంటాయి. కానీ ఇంటి ఆవరణలోనే ఉన్న ఈ విద్యుత్ స్తంభాన్ని చూసి ఎవ్వరైనా ఆశ్చర్యపోవాల్సిందే!. మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో అనాచి రమేశ్ అనే వ్యక్తికి చెందిన ఇంటి పైనుంచి విద్యుత్ వైర్లు వెళుతున్నాయి. ఈక్రమంలో వైర్లు కిందికి ఉండటంతో ప్రమాదం సంభవించకుండా మెట్ల పిల్లర్‌కు ఓ పైపు ద్వారా పోల్ తయారు చేసి దానికి వైర్లు పైకి ఉండేలా ఏర్పాటు చేశాడు. ఈ దృశ్యాన్ని అటుగా వెళ్లేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. అయితే వైర్లను, స్తంభాన్ని విద్యుత్‌శాఖ అధికారులు రోడ్డు పక్కన ఏర్పాటు చేయాల్సిందని పలువురు పేర్కొంటున్నారు.

– మాచారెడ్డి

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో చండీయాగం

- హాజరైన కలెక్టర్, సీపీ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన దుర్గా పరమేశ్వరీ మాత మందిరంలో మంగళవారం మహా చండీయాగం నిర్వహించారు. యాగానికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ పోతరాజు సాయిచైతన్యలు సతీమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు బస్వారెడ్డి, రామచంద్రరావు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ఆర్మూర్, బోధన్ సబ్ కలెక్టర్లు అభిజ్ఞాన్ మాల్వీయ, వికాస్ మహతో, డీఎంహెచ్‌వో రాజశ్రీ, ట్రెయినీ కలెక్టర్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య

ఉద్యోగులకు విరమణ తప్పదు



రిటైర్డ్ అయిన సిబ్బందితో సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని, ఎలాంటి రిమార్క్ లేకుండా పనిచేయడం గొప్ప విషయమని సీపీ పోతరాజు సాయిచైతన్య పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖలో పదవీ విరమణ చేసిన ఎస్సైలు బాబూరావు, ఎండీ నసీరుద్దీన్, సీపీ ఆఫీస్ సూపరింటెండెంట్ వనజా రాణిలను మంగళవారం సీపీ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ఎలాంటి అవసరం ఉన్నా పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, రూరల్ ఎస్సై ఎండీ ఆరీఫ్, రిజర్వ్ సీఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోను ముంచిన ‘మంజీర’

- వరద పోటెత్తడంతో నీటమునిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న స్తంభాలు
- సుమారు రూ.20 లక్షల నష్టం



మంజీర పరీవాహక ప్రాంతంలో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్



నాగిరెడ్డిపేట శివారులో నీటమునిగిన ట్రాన్స్‌ఫార్మర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలో నదికి వరద పోటెత్తడంతో ట్రాన్స్‌కోకు భారీ నష్టం వాటిల్లింది. గతనెలాఖరులో కురిసిన భారీ వర్షాలతో ఎగువ నుంచి వచ్చిన వరదనీటి ప్రవాహానికి మండలంలోని ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్‌శాఖకు సుమారు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మండలంలోని 131 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతోపాటు సుమారు 200 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని అధికారులు తెలిపారు. అలాగే మండలంలోని గోలిలింగాల, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, లింగంపల్లికలాన్, వెంకంపల్లి, తాండూర్, మాటూర్, మాసాన్‌పల్లి, ఆత్మకూర్ తదితర గ్రామాల శివారుల్లోని పంట పొలాలు నీటమునిగాయి. కాగా, వరదనీటి నుంచి బయటపడ్డ పంటలను గట్టెక్కించాలనే ఉద్దేశ్యంతో తాత్కాలికంగా రెండు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి వ్యవసాయ బోరుబావులకు కరెంట్ సరఫరా చేశారు. దీంతో పాటు సుమారు 80 ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టి తిరిగి బిగించారు. సుమారు నెలరోజులుగా పంటపొలాలు వరద నీటిలోనే ఉండడంతో మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టలేకపోతున్నారు. వరదనీరు పూర్తిగా తొలగిపోయిన తర్వాత నీటమునిగిన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టడంతోపాటు నేలకూలిన స్తంభాలను సరిచేస్తామని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సమృద్ధి జీపీగా వేల్పూర్



వేల్పూర్: బీఎస్‌ఎన్‌ఎల్ సమృద్ధి గ్రామ పంచాయతీగా వేల్పూర్ ఎంపికైనట్లు సంస్థ హైదరాబాద్ నోడల్ అధికారి నంబి మృదుపాణి పేర్కొన్నారు. మంగళవారం ఆమె వేల్పూర్ గ్రామ పంచాయతీలో బీఎస్‌ఎన్‌ఎల్ సమృద్ధి ద్వారా అందించే సేవలను వెల్లడించారు. సమృద్ధి ద్వారా అంతరాయం లేకుండా ఇంటర్నెట్ సేవలు లభిస్తాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ సబ్ డివిజన్ ఇంజినీర్ హనుమాన్‌సింగ్, మోర్తాడ్ ఎస్‌డీఈ చిన్నయ్య, నెట్‌వర్క్ ఇంజినీర్ సుమన్‌రెడ్డి, మోర్తాడ్ ఫీల్డ్ టెక్నీషియన్ సతీశ్‌కుమార్, జేఈ రాకేశ్‌కుమార్, వేల్పూర్ టీపీపీ సుధాకర్ పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు చేయాలి



నవీపేట: మండలంలోని యంచ గోదావరి నది బ్రిడ్జిపై దుర్గామాత నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని బీజేపీ నాయకులు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి జిల్లా కేంద్రంలో మంగళవాం వినతిపత్రం సమర్పించారు. దూర ప్రాంతంలోని దుర్గామాత విగ్రహాలను యంచ గోదావరి నదిలో నిమజ్జనం చేస్తారని, ఇంత వరకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి, మండల నాయకులు ద్యాగ నరిన్, రాజేందర్‌గౌడ్, రాజశేఖర్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాక్లూర్: అడ్డుగా వచ్చిన గేదెలను తప్పించబోయి ఓ యువకుడు బైక్‌పై నుంచి కిందపడి మృతి చెందిన ఘటన మండలంలోని మాదాపూర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు... నందిపేట మండలం వెల్మల్ గ్రామానికి చెందిన మద్దెపల్లి మోహన్ (44) ద్విచక్ర వాహనంపై రాత్రి 7 గంటలకు పని నిమిత్తం నిజామాబాద్ వెళుతున్నాడు. మాదాపూర్ గ్రామం వద్ద పాడి గేదెలను తప్పించబోయి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావటంతో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో 17 మందికి గాయాలు

- చిన్నారి పరిస్థితి విషమం



ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్ శివారు ప్రాంతం, వెంకటేశ్వర కాలనీ, ఔటిగల్లీల్లో పిచ్చి కుక్కల స్వైరవిహారం చేశాయి. మంగళవారం సుమారు 17 మందిపై దాడి చేశాయి. క్షతగాత్రులకు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు చికిత్స నిర్వహించారు. కాగా, ఓ చిన్నారి పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మాక్లూర్ : మండలంలోని కొత్తపల్లి శివారులో ఉన్న ఓ మామిడి తోటలో పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ.4,620 నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు



పడ్కల్ తండా జట్టుకు బహుమతి అందజేస్తున్న నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మచ్చర్లలో గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 24 జట్లు పాల్గొన్నాయి. తుది పోరులో జక్రాన్‌పల్లి మండలం పడ్కల్ తండా విజేతగా నిలువగా, మచ్చర్ల రెండో స్థానంలో నిలిచింది.

విజేతలకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు యెర్ర జితేందర్ రెడ్డి రూ.8,888 నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో షేక్ సమీర్, వెల్మ రాజ్‌కుమార్, ఉప్పు గంగారెడ్డి, కొర్వ ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పేరిణి నాట్య ప్రదర్శన

బోధన్: తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సోమవారం సాయంత్రం జిల్లాకు చెందిన ధనిత్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పేరిణి సతీశ్ బృందం నాట్య ప్రదర్శన ఇచ్చారు. జిల్లా కేంద్రానికి చెందిన నాట్య గురువు ఆధ్వర్యంలో 25 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ సంగీత కళాశాల ఆధ్వర్యంలో 10 రాష్ట్రాల నుంచి 463 మంది నృత్య కళాకారులతో కూడిన 21 బృందాలు పాల్గొనగా, అందులో జిల్లాకు చెందిన పేరిణి నాట్య బృందం ఒకటి. ఈ సందర్భంగా నాట్య గురువు సతీశ్ మాట్లాడుతూ ఈ అవకాశం దక్కడం గొప్ప గౌరవమని, కళాకారులందరూ సమన్వయంతో ప్రదర్శనను విజయవంతం చేశారని హర్షం వ్యక్తంచేశారు.